## క్లుప్తంగా

### గ్రామదేవత ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష



ఉత్సవంపై చర్చిస్తున్న గ్రామ పెద్దలు

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో జూన్ ఒకటి నుంచి పదో తేదీ వరకు నిర్వహించతల పెట్టిన కంచమ్మతల్లి గ్రామదేవత ఉత్సవాల ఏర్పాట్లపై గ్రామస్తులు సమీక్షా చేపట్టారు. స్థానిక రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని శ్రీరామ మందిరం ఆవరణలో ఆదివారం సాయంత్రం సమావేశాన్ని నిర్వహించారు. తొమ్మిది రోజులు జరగనున్న ఉత్సవాల్లో నిర్వహించే కార్యక్రమాలపై చర్చించారు. ముఖ్యంగా ముందస్తుగా పారిశుధ్య నిర్వహణ, కరెంటు సమస్యలు, ట్రాఫిక్, మెడికల్, దుకాణాల్లో నాణ్యమైన వస్తువులు విక్రయించేలా నోటీసులు ఇవ్వడానికి నిర్ణయించారు. అమ్మవారు ఊరేగింపు రూట్ మ్యాప్ కోసం వివరించారు.

### చలంకు ఉత్తమ విలన్ పురస్కారం



ఉస్మాన్‌ఖాన్ పాత్రలో చలపతిరావు

కవిటి: అనపర్తి నియోజకవర్గం రామవరంలో మూడు రోజులు పాటు నిర్వహించిన 29వ జాతీయ నాటక పరిషత్ పోటీలలో బొరివంకకు చెందిన శార్వాణీ సాంస్కృతిక గిరిజన సమాఖ్య ప్రదర్శించిన కొత్తపరిమళం నాటిక ప్రేక్షకులను అలరించింది. ఇందులో విలన్ పాత్ర పోషించిన ఉస్మాన్‌ఖాన్ పాత్రధారి బల్లెడ చలపతిరావుకు ఉత్తమ ప్రతినాయకుని అవార్డు లభించిందని సామాఖ్య ప్రతినిధులు ఆదివారం తెలిపారు.

### 6 నుంచి పెంటపోలమ్మ జాతర



జాతర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పదోవార్డు పెంటవీధి, పాందరవీధిలో వెలసియున్న పెంటపోలమ్మ అమ్మవారి జాతరను వచ్చే నెల ఆరు నుంచి పదో తేదీ వరకూ వైభవంగా నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు పెంట సంజీత్, రూప్ సుందర్, విజయ్, ఉమాకాంత్, శివ, రాజేందర్, కామేష్ చెప్పారు. అమ్మవారి ఆలయం ప్రాంగణంలో ఆదివారం సమావేశమై ఉత్సవంపై చర్చించారు. ఉత్సవం జరిగే రోజుల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జాతర కరపత్రాలనులు విడుదల చేశారు.


### చినబాడంలో క్రికెట్ టోర్నీ ప్రారంభం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఏడోవార్డు పరిధిలోని ప్రభుత్వ క్రీడా మైదానంలో ఆదివారం చినబాడం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. సుమారు 30 జట్లు పాల్గొంటున్న టోర్నమెంట్ సుమారు 15 రోజులు జరగనుంది. ముఖ్యఅతిథులుగా నాయకులు పోతనపల్లి హరిప్రసాద్, బడ్డ నాగరాజులు హాజరై టోర్నీని ప్రారంభించారు.

# టెర్రర్ పుట్టిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లు!



కాశీబుగ్గ: కాశీబుగ్గలో ట్రాన్స్‌ఫార్మర్‌ను చుట్టేసిన తీగలు



కాశీబుగ్గ: ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకున్న తీగలు..



కాశీబుగ్గ: పలాస వివేకానంద మార్గ్‌లో ప్రమాదకరంగా..

- ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ స్తంభాలను చుట్టేస్తున్న తీగలు
- తరచూ బ్రేక్ డౌన్‌కు కారణమవుతున్న వైనం
- ప్రాణాలు కోల్పోతున్న జీవాలు



కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మరణించిన వానరం(ఫైల్)



వజ్రపుకొత్తూరు: సుంకర జగన్నాథపురం వద్ద 11 కేవీ విద్యుత్ స్తంభాలను అల్లుకున్న తీగలు



వజ్రపుకొత్తూరు: పాతటెక్కలి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకున్న పచ్చని తీగలు

కాశీబుగ్గ/వజ్రపుకొత్తూరు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు వణుకుపుట్టిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వీటిని వెంటనే తొలగించాల్సిన సంబంధిత అధికారులు తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని చాలా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలను ఆహ్వానిస్తున్నాయి. వర్షా కాలం ప్రారంభానికి ముందే కలుపుమొక్కలు పెరిగి పెద్దవై ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, తీగలను అల్లుకుంటున్నాయి. కొన్నైతే ఏకంగా నేల నుంచి స్తంభాలపైకి ఎగబాకి తీగలను చుట్టేస్తున్నాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం తలెత్తుతోంది. అలాగే కలుపు మొక్కలను తినేకుందుకు వెళ్తున్న పశువులు విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోతున్నాయి. అలాగే చేతికి అందే చాలాచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటున్నాయి. వీటి వద్ద పెరుగుతున్న గడ్డి, వివిధ మొక్కలను తినేందుకు వెళ్తున్న పశువులు షాక్‌కు గురై మృత్యువాత పడుతుండడంతో వాటి యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల అనేక ప్రాంతాలలో పశువులు ఈ విధంగా చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. పలాస నియోజకవర్గంలోని పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాలతో పాటు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 31 వార్డులలో చాలా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కనీసం రక్షణ కంచెలు కూడా లేవు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వర్షా కాలం ప్రారంభానికి ముందే పిచ్చిమొక్కలు, తీగలతో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, లైన్లను గుర్తించి వాటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

#### మొక్కలను తొలగిస్తున్నాం

పలాస విద్యుత్ డివిజన్ పరిధిలో ప్రతి వారం మరమ్మతులు చేపడుతున్నాం. ప్రతీ శుక్రవారం పెరుగుతున్న చెట్లు కొమ్మలను కత్తిరిస్తున్నాం. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్‌లు, స్తంభాలకు అల్లుకున్న పిచ్చి మొక్కలు తొలగిస్తున్నాం. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచెల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. విద్యుత్ ప్రమాదాలకు అవకాశం ఉన్నట్టు అనుమానం ఉంటే పలాస ఈఆర్‌లో కార్యాలయానికి సమాచారం తెలియజేయండి. – జి.యజ్ఞేశ్వరరావు, విద్యుత్‌శాఖ ఏఈ, పలాస డివిజన్

### • మురుగు రోడ్డు..



కంచిలి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రహదారి చెత్తగా తయారైంది. కాలువల్లో ప్రవహించాల్సిన మురుగు నీరు రోడ్డుపైకి ప్రవహిస్తోంది. వారం రోజులుగా ఈ పరిస్థితి ఉంది. ఆ మార్గంలోనే రాకపోకలు సాగించే మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు కనీసం పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డు మార్గం కంచిలి, ఎస్.ఆర్.సి.పురం పంచాయతీల పరిధిలోకి వస్తుండగా, రెండు పంచాయతీలవారు పర్యవేక్షించకపోవడంతో ఎప్పటికప్పుడు ఇదే పరిస్థితి ఏర్పడుతోంది. – కంచిలి

### • విశ్రాంతి మండపం ప్రారంభం



కంచిలి మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన సోంపేటకు చెందిన మలిపెద్ది బ్రదర్స్ ఆర్థిక సాయంతో నిర్మించిన ప్రయాణికుల విశ్రాంతి మండపాన్ని స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆదివారం ప్రారంభించారు. జాతీయ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తున్న ఇంటర్‌స్టేట్ ఎక్స్‌ప్రెస్, ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం దీన్ని నిర్మించినట్లు దాతలు తెలిపారు. షెల్టర్‌ను గ్రామదేవత కంచమ్మతల్లి ఆలయ కమిటీకి నిర్మాణ దాతలు రాతపూర్వకంగా అప్పగిస్తూ డాక్యుమెంట్లను అందజేశారు. ఎంపీడీవో వి.తిరుమలరావు, కంచమ్మతల్లి ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. – కంచిలి

### • అమ్మవారికి చల్లదనం



ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం.. కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారికి, జగతిలో వెలసిన మర్లపోలమ్మ అమ్మవారికి ఆదివారం ఆయా గ్రామాలకు చెందిన భక్తులు చల్లదనం ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారి ప్రతిరూపంగా భావించే గజముద్దను మేళతాళాలతో కాళికావేషధారణల నృత్య ప్రదర్శనలతో గ్రామవీధుల్లో ఊరేగించారు.అనంతరం గ్రామశివార్లలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. – కవిటి

# పిల్లలపై దృష్టిసారించాలి



మాట్లాడుతున్న బీకేఆర్ పట్నాయక్

కాశీబుగ్గ: పిల్లలపై తల్లిదండ్రులు నిత్యం దృష్టిసారించాలని వక్తలు అన్నారు. అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సూచనల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సును ఆదివారం నిర్వహించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జాతర్లు, జనం రద్దీగా ఉండే ప్రదేశాలలో తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరికైనా అనుమానాస్పదంగా పిల్లలు తిరుగుతున్నట్టు అనుమానం వస్తే 100, 1098 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పలాస బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బీకేఆర్ పట్నాయక్, ఏజీపీ పిండి వెంకట్రావు, జాయింట్ సెక్రెటరీ అనిల్ రాజు, న్యాయవాదులు లోకేశ్వరరావు, దేవరాజు, ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ సంతోష్ కుమార్, కానిస్టేబుల్ బాబురావు, పారాలీగల్ వలంటీర్లు సునీల్‌కుమార్, తిరుపతిరావు పాల్గొన్నారు.

# జ్ఞాపకాల దొంతరలోకి..



సోంపేట పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న పూర్వవిద్యార్థులు



కవిటి: బొరివంకలో ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు



కవిటి: ముత్యాలపేటలో ఇలా..



ఇచ్ఛాపురం టౌన్: ఒకే వేదికపై సత్యసాయి పాఠశాల పూర్వ విద్యార్థులు



కాశీబుగ్గ: ఒకే వేదికపై ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు

సోంపేట: సోంపేట ఉన్నత పాఠశాలలో 1992–93 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న 135 మంది పూర్వ విద్యార్థులు 32 ఏళ్ల తరువాత ఆదివారం ఒకే వేదికపై కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చదువుకున్న రోజులను జ్ఞాపకం చేసుకొని మురుసుపోయారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి చదువు చెప్పిన గురువులతో సోంపేట ఉన్నత పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించి ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకున్నారు. ఉపాధ్యాయులను దుశ్శాలువలతో సత్కరించి గౌరవించారు. పూర్వవిద్యార్థులు ఈపరి రవి, చిత్రాడ వినోద్, టంకాల ప్రవీణ్, సూర్యనారాయణ, బంగారి శాంతి స్వరూప్, చక్రధర్, అచ్యుత్, మద్దు బుద్దేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

• కవిటి: మండలంలోని బొరివంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2004–05, ముత్యాలపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2005–06 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాలు ఆదివారం ఆనందంగా జరిగాయి. ఆనాటి గురువులకు పూర్వ విద్యార్థులు పాదపూజ చేసి.. దుశ్శాలువలతో సత్కరించి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం విందు భోజనాలు చేశారు. గ్రూప్ ఫొటోలు తీసుకుని ఆనందంగా గడిపారు.

• ఇచ్ఛాపురం టౌన్: పట్టణంలోని సత్యసాయి పాఠశాలలో 1998–99 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు వీజే ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ కలయిను ఏర్పాటు చేసుకున్నారు. చాలా రోజుల తరువాత ఒకే వేదికపై కలుసుకోవడంతో సంతోషం వ్యక్తం చేశారు. విద్యా బోధనం చేసిన గురువులు దివాకర్, నాగేశ్వరరావు, దేవరాజు, లోహిదాస్, దుదిస్టిలకు, దేశరక్షణలో విధులు నిర్వహిస్తున్న తోటి మిత్రులను సత్కరించారు. పాఠశాల వ్యవస్థాపకులు కృష్ణమూర్తి మృతికి సంతాపం తెలియశారు. ఆయన సతీమణి లక్ష్మిని సన్మానించారు.

• కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2006–07 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ద్వారా ఒకే వేదికపై కలుసుకున్నారు. సుమారు రెండు వందల మంది ఒకేచోట చేరి సందడి చేశారు. చదువు చెప్పిన ఉపాధ్యాయులు పాలవలస వైకుంఠరావు, పి.తవిటయ్య, నిర్మల, రాజ్యలక్ష్మి, విజయ్ కుమార్, లింగాలరాజు, ప్రధాన్, సత్యనారాయణ, అప్పారావు, మాధవ్ పాత్రో, మాధవ్‌రావును సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

## • ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



కొరికానపుట్టుగ-మోక్షిత్ లెవెన్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతున్న దృశ్యం

కంచిలి: మండలంలోని మకరాంపురం గ్రామంలో అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు ఉత్సాహవంతంగా జరుగుతున్నాయి. ఆదివారం మూడ్యు మ్యాచ్‌లు జరిగాయి. ఉదయం మోక్షిత్ లెవెన్ – కొరికానపుట్టుగ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మోక్షిత్ లెవెన్ జట్టు గెలుపొందింది. మధ్యాహ్నం సహలాలపుట్టుగ-రెస్ట్ ఆఫ్ సాలినపుట్టుగ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సహలాలపుట్టుగ విజయం సాధించింది. సాయంత్రం మోక్షిత లెవెన్ –సహలాలపుట్టుగ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మోక్షిత్ లెవెన్ జట్టు గెలుపొందింది.

# మట్టిరోడ్లతో యాతన!

- అభివృద్ధికి నోచుకోని పల్లె రోడ్లు
- హామీని నిలబెట్టుకోలేని కూటమి ప్రభుత్వం



వర్షానికి రోడ్డు పైనుంచి ప్రవహిస్తున్న నీరు



పంచాయతీ ఆర్థిక సంఘం నిధులతో రోడ్డు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కంచిలి: ప్రతీ గ్రామానికి పక్కా రోడ్డు ఏర్పాటు చేస్తున్నామని పాలకులు చెబుతున్న మాటలు క్షేత్ర స్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. ఇప్పటికీ చాలా గ్రామాలకు మట్టిరోడ్లే దిక్కు. ఆ రోడ్లపై ప్రయాణాలు చేయలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షా కాలంలో వీరి పరిస్థితి మరీ ఘోరంగా ఉంటుంది. దీనికి కంచిలి మండల పరిధి జలంత్రకోట పంచాయతీ పరిధిలో ఏడు గ్రామాల పరిస్థితిని ఉదాహరణగా చెప్పవచ్చు. ఈ పంచాయతీ పరిధిలో ఏడాదిలో ఆరు నెలలు రోడ్డు అధ్వాన స్థితిలోనే ఉంటుంది. ఈ గ్రామాలకు ఉన్న మట్టి రోడ్లపై వర్షాకాలంలో వాహనాల రాకపోకలు సాగించలేక స్థానికులు అష్టకష్టాలు పడుతున్నారు. కొన్ని దశాబ్దాలుగా ఇక్కడ ఇదే దుస్థితి. పంట పొలాల మధ్యలోంచి వేసిన ఈ మట్టి రోడ్లు వర్షాకాలంలో నీటిలో మునిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ రోడ్లపై పయనించాలంటే ప్రజలు వణికిపోతున్నారు. విద్యార్థులు, రోగులు, వృద్ధులు, గర్భిణులు ఈ రోడ్లపై రాకపోకలు సాగించాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

#### శంకుస్థాపనతోనే సరి..

ఈ గ్రామాలకు పక్కా రోడ్డు నిర్మాణానికి 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ శంకుస్థాపన చేశారు. అయితే పనులకు మాత్రం నేటికీ కార్యరూపం దాల్చలేదు. పంచాయతీకి వచ్చే ఆర్థిక సంఘం నిధులు వెచ్చించి ఏటా మరమ్మతులు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా మార్పు చోటుచేసుకోలేదు. పల్లె పండుగ కార్యక్రమంలోనైనా తమ రోడ్డు దశ మారుతోందని ఆశించినా ప్రతిపాదనలు కూడా పంపకుండా నిర్లక్ష్యం చేశారని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. జలంత్రకోట పంచాయతీ కేంద్రం నుంచి ఒకవైపు జె.మాణిక్యపురం, మరోవైపు చొత్రాయిపురం, పోటుగుడ్డి, ఉప్పరిపేట, చిలకలమెట్ట, మధుపురం గ్రామాలు రెండు రోడ్డు మార్గాల్లో మొత్తం ఏడు గ్రామాలు ఉన్నాయి. 2024 ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత కేంద్ర మంత్రిగా ఉన్న కె.రామ్మోహననాయుడు, ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్‌లు కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మొదటగా కొబ్బరికాయ కొట్టి ఈ గ్రామాల రోడ్డు సమస్య తీర్చుతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పగ్గాలు చేపట్టి ఏడాది పూర్తయినా ఆ హామీకి అతీగతి లేదని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. ఈ ఏడాది కూడా తమకు రహదారి కష్టాలు తప్పవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# బాలల సంరక్షణపై అవగాహన



స్టేషన్ మేనేజర్‌తో మాట్లాడుతున్న చైల్డ్ హెల్ప్ డెస్క్ సూపర్‌వైజర్ జాస్మిన్ కుమారి

కంచిలి: జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికార అధికారి ఆదేశాల మేరకు సోంపేట రైల్వేస్టేషన్‌లో చైల్డ్ హెల్ప్ డెస్క్‌టీం ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై ఆదివారం అవగాహన కల్పించారు. పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, బాలికల అక్రమ రవాణా జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయాణికులకు వివరించారు. బాల బాలికలకు రక్షణ, సంరక్షణ అవసరమైతే 1098 నంబర్ సమాచారం అందించాలని చైల్డ్ హెల్ప్ డెస్క్ సూపర్‌వైజర్ ఆర్.జాస్మిన్ కుమారి అన్నారు. సోంపేట రైల్వేస్టేషన్ మేనేజర్‌తో సూపర్‌వైజర్ చర్చించారు.

### గందరగోళంగా సూచీ బోర్డుల ఏర్పాటు!




పలాసకు వ్యతిరేక దిశలో సోంపేట, కంచిలి ఉన్నట్టు ఏర్పాటు చేసిన సూచీబోర్డు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం జాతీయ రహదారి 16ను ఆనుకొని ఉన్న బెల్లుపడ-ఎస్.కె.ఇ(సోంపేట-కవిటి-ఇచ్ఛాపురం) ప్రధాన రహదారి కూడలిలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు వాహనదారులను అయోమయానికి గురిచేస్తున్నాయి. ఈ మార్గంలో ప్రయాణించే కొత్తవారు సూచిబోర్డులను అనుసరించే వెళ్తొంటారు. అయితే బెల్లుపడ- ఎస్.కె.ఇ రోడ్ కూడలికి ఇరువైపులా స్పీడ్ బ్రేకర్ల వద్ద ఏర్పాటు చేసిన సూచిబోర్డుల్లో పలాస, సోంపేట, కంచిలి ఒకే వైపు ఉండాలి. కాని అందుకు విరుద్ధంగా పలాస ఒక వైపుండగా, సోంపేట, కంచిలి ఊర్లు మాత్రం ఒడిశా వైపు వెళ్లేలా సింబల్‌ను సూచిబోర్డులో ఏర్పాటు చేశారు. దీంతో కొత్తవారు ప్రయాణాలు చేసేటప్పుడు వెళ్లాల్సిన గమ్యానికి కాకుండా ఒడిశా వైపు వెళ్లి అక్కడి వారిని అడిగి వెనక్కి రావాల్సి వస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ బోర్డులను మార్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.